క్లుప్తంగా

ఛత్రపతి శివాజీ పోరాట పటిమ ఆదర్శనీయం



శివాజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్ : మనువాదులకు వ్యతిరేకంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ సాగించిన పోరాటం బహుజనులకు ఆదర్శనీయమని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మొండెం సంతోష్ కుమార్ అన్నారు. సోమవారం ఏలూరులోని ఎస్‌ఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఛత్రపతి శివాజీ 394 జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ శివాజీ గొప్పపాలకుడు, రాజనీతిజ్ఞుడు, మనువాదులను అంతమొందించిన ధైర్యశాలి అని కొనియాడారు. శివాజీ జీవితం దేశాన్ని పాలించిన అనేక మంది రాజులు, సంస్థానాధీశులకు సైతం స్ఫూర్తి నింపిందన్నారు. కార్యక్రమంలో పంప నాగరాజు, మురళీకృష్ణ, పూసరాజు రాజేష్ తదితరులు శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బిషప్ జయరావు సేవలు అభినందనీయం



బిషప్ జయరావును సన్మానించిన నాయకులు

ఏలూరు రూరల్ : ఏలూరు ఆర్‌సీఎం పీఠాధిపతి జయరావు పొలిమేర పేదలకు చేస్తోన్న సేవలు వెలకట్టలేమని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు పొలిమేర హరికృష్ణ అన్నారు. విశాఖ ఆర్‌సీఎం అడ్మినిస్ట్రేటర్‌గా బాధ్యతలు చేపట్టిన జయరావును సోమవారం ఏలూరు బిషప్ హౌస్‌లో హరికృష్ణతో పాటు సొంగా మధు, పి.బాలరాజు కలిసి శాలువ కప్పి అభినందించారు. జయరావు పేద విద్యార్థులను చేరదీసి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం సంతోషంగా ఉందని హరికృష్ణ అన్నారు. వృద్ధులు, అనాథలను ఆదరించి వారికి ఆహారం, దుస్తులు అందించి ఆశ్రయం కల్పిస్తున్నారని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత



19వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్



17వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్

- ఎమ్మెల్యే ఆళ్ల నాని
- రూ.3.45 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఏలూరు నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి ఎమ్మెల్యే నాని శంకుస్థాపన చేశారు. 19వ డివిజన్‌లో రూ.85 లక్షలు గడపగడపకు మన ప్రభుత్వం నిధులు, రూ.19 లక్షల నగర పాలక సంస్థ సాధారణ నిధులతో చేపట్టే 10 సీసీ రోడ్లు, 5 సీసీ డ్రెయిన్లు, 3 పైపులైన్లు, ఒక బోరువెల్ నిర్మాణానికి, 17వ డివిజన్‌లో రూ.84 లక్షలు వ్యయంతో 15 సీసీ రోడ్లు, 7 సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 18వ డివిజన్‌లో రూ.1.37 కోట్లు వ్యయంతో 24 సీసీ రోడ్లు, 7 సీసీ డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నగరంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళుతున్నట్టు చెప్పారు. ఏలూరు 50 డివిజన్లలోనూ వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పించాలనే సంకల్పంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. సోమవారం ఒక్కరోజే రూ.3.45 కోట్ల 49 సీసీ రోడ్లు, 19 సీసీ డ్రెయిన్లు, 3 పైపులైన్లు, ఒక బోరు వెల్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామని, త్వరలోనే పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఎమ్మెల్యే నాని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, కార్పొరేటర్లు యర్రంశెట్టి నాగబాబు, మునగాల కేదారేశ్వరి, పాము పద్మ, పార్టీ క్లస్టర్-1 అధ్యక్షులు సుంకర చంద్రశేఖర్, నగర బీసీ సెల్ అధ్యక్షులు లక్కోజు రాజగోపాలాచారి, పార్టీ నాయకులు ఇనపనూరి జగదీష్, డిప్యూటీ కమిషనర్ ఎన్ రాధ తదితరులున్నారు.



18వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నానితో చిన్నారులు

హమాలీల అభివృద్ధికి కృషి



హమాలీలకు దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు రూరల్: హమాలీల అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో హమాలీలకు ఆయన దుస్తులు పంపిణీ చేశారు. ఈ యార్డ్‌లో జెంబోషెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసిందని నాని గుర్తు చేశారు. ఇదే క్రమంలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కోసం లక్షలాది నిధులు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. కరోన సమయంలో హమాలీలకు ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లు నిర్వహించామని గుర్తు చేశారు. లాక్‌డౌన్ సమయంలో రైతులు ఆర్థిక నష్టపోకుండా ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కల్పించామని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలతో పాటు హమాలీలూ సంక్షేమ పథకాలు అందుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు మాట్లాడుతూ ఎమ్మెల్యే నాని సహకారంతో రైతులు, హమాలీలకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏటా హమాలీలకు దుస్తులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో యార్డ్ వైస్ చైర్మన్ కంచెన రామకృష్ణ, నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, రైతు నాయకులు నాగం శివ తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి

పెదవేగి : పాత కక్షల నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులు కలిసి ఒక వ్యక్తిపై దాడి చేసి గాయపరచారని పెదవేగి పోలీసులకు ఫిర్యాదు అందింది. పెదవేగి ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన లంకపల్లి అశోక్ రెండు రోజుల క్రితం కూరగాయలు అమ్ముకుంటా మోటారు సైకిల్‌పై వెళుతుండగా, అదే సమయంలో కాటం రంగారావు, మరో వ్యక్తి కలిసి పాత కక్షల నేపథ్యంలో అశోక్‌పై దాడి చేసి, గాయపరిచారని తెలిపారు. ఈ ఘటనపై సోమవారం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

వైభవంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



సాయిబాబా మందిర ఆవరణలో పూజలు చేస్తున్న భక్తులు

పెదవేగి : పెదవేగి మండలం బాపిరాజుగూడెంలోని షిర్డీ సాయినాథుని మందిర దశమ వార్షికోత్సవ ఐదు రోజుల వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ముగింపు రోజు ఉదయం ఐదు గంటలకు సాయినాథునికి, ఇతర దేవతా మూర్తులకు పంచామృత అభిషేకాలు, 108 కలశాలతో కూడిన వివిధ నదీ జలాలు, 108 లీటర్ల ఆవు పాలతో అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పండ్లు, మధుర పదార్థాలు నైవేద్యంగా సమర్పించి సాయినాథునికి సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం జంట నాగుల విగ్రహ ప్రతిష్ఠ చేసి, శ్రీవల్లీ దేవసేవ సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గోశాలలో గరుకు స్తంభం ప్రతిష్ఠ చేశారు. భక్తులకు భారీ అన్నసమారాధన, అనంతరం సాయినాథుని గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు బాబావారి అన్నప్రసాదం స్వీకరించారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు పంచాయతీ కార్యదర్శుల వినతి



జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీకి వినతి పత్రం అందించిన గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు

పెదపాడు: మండలంలోని గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీకి వినతిపత్రం అందించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డీడీఓ అధికారాలను అమలు చేసేందుకు జారీ చేసిన జీవో-11ను అమలు చేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి అమలయ్యేలా చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు వినయ్, రాజేష్, పార్వతి, ఉమా భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

ఏలూరు రూరల్: నేటి యువత ఓటు విలువ తెలుసుకొని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని మానవత సేవా సంస్థ అధ్యక్షుడు మేతర అజయ్‌బాబు అన్నారు. సోమవారం ఏలూరులోని ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో 'ఓటు విలువ, హక్కు, బాధ్యత' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌బాబు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ఉత్తమ సమాజ స్థాపన, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. ప్రలోభాలకు గురికాకుండా నిజాయితీగా ఓటు వేయాలని సూచించారు. కొత్త ఓటర్లు ఓటు ఆవశ్యకత, విలువ తెలుసుకొని, బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో అశోక్, సూరిబాబు, మాధవరావు, సూర్యారావు, జాకబ్ పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై 21న విచారణ

దెందులూరు: దెందులూరు గ్రామ పంచాయతీలో కోటి రూపాయల నిధుల దుర్వినియోగంపై రెండోసారి విచారణకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ లిఖిత పూర్వక ఆదేశాలు సోమవారం జారీ చేశారు. జంగారెడ్డిగూడెం డీఎల్‌పీఓ కార్యాలయంలో ఈ నెల 21న దెందులూరు గ్రామ పంచాయతీకి సంబంధించిన అన్ని రికార్డులు, రశీదులు తీసుకురావాలని పంచాయతీ అధికారులకు కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్నారు.

గతంలో నిధులు దుర్వినియోగంపై గ్రామానికి చెందిన చిలికి శేఖర్ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ విచారణ చేసి కోటి రూపాయలకు పైగా నిధులు దుర్వినియోగమయ్యాయని గుర్తించారు. ఈ మేరకు నివేదికను డీపీఓ ద్వారా కలెక్టర్‌కు పంపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ ఇటీవల దెందులూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ తోట ఏసమ్మ చెక్ పవర్‌ను రద్దు చేశారు. అనంతరం రెండోసారి విచారణ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	60-68
వంకాయలు (కాంతులు)	--	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	48	ములక్కాడలు	05-10
బెండకాయలు	48	కంద	60
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	40
కాకర కాయలు	40-50	కీరా దోస	30
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	74
కాలీఫ్లవర్	25-30	అల్లం	120
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	30-36	పాలకూర	10
దొండకాయలు	34	చుక్కకూర	10
బంగాళదుంపలు	24	తోటకూర	10
ఉల్లిపాయలు	20-22	గోంగూర	08
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	28-25	బఠాణి	--
ఆనబకాయ (1)	20-22	క్యాప్సికమ్	74
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	34

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	44
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	35
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	22
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	22
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	33

వైభవంగా అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలు



గాలాయగూడెంలో ప్రత్యేక అలంకరణలో అచ్చమ్మ పేరంటాలమ్మ



హాజరయ్యే భక్తుల కోసం ఏర్పాటు చేసిన నూతన కల్యాణ మండపం

దెందులూరు: గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారిని ఆలయ అర్చకులు వివిధ రకాల పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ట్రాఫిక్, తాగునీరు, విద్యుత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమ్మవారి ఉత్సవాలకు భక్తులు రాక గణనీయంగా పెరగడంతో గ్రామానికి చెందిన దాత గంటా కోటేశ్వర రావు, అచ్చమ్మ దంపతులు నూతన కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేశారు.

ఉత్సవాలకు బందోబస్తు

అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలకు రెండు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా శాఖాపరంగా పటిష్ఠమైన చర్యలు తీసుకున్నట్టు పెదవేగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం అమ్మవారి ఉత్సవాల్లో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎస్సై కె.స్వామి, ఆలయ కమిటీ సభ్యులు సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, అంబటి లక్ష్మణరావు, తోట వెంకన్న, పూజారి రాంబాబు తదితరులతో మాట్లాడారు. పలు సూచనలు చేశారు. భక్తులు ఆలయంలోకి వెళ్లడానికి, ఆలయం నుంచి బయటకు రావడానికి మూడు మార్గాలు, వాహనాల పార్కింగ్, తాగునీరు, ప్రథమ చికిత్స కేంద్రం, విద్యుత్ సౌకర్యాలు కల్పనలో ఆలయ కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తమ సిబ్బందితో అమ్మవారి ఉత్సవాల్లో ఔట్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ కమిటీ, పోలీసుల సమన్వయంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఎటువంటి అసౌకర్యం కలిగినా తనకు, దెందులూరు ఎస్సై స్వామికి, సమాచారం ఇవ్వాలని ఆలయ కమిటీని సీఐ శ్రీనివాస్ ఆదేశించారు.

ఏపీయూడబ్ల్యూజే డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, చిత్రంలో నాయకులు

ఏలూరు టౌన్: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఏలూరు జిల్లా డైరీని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తన చాంబర్‌లో సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య జర్నలిస్టులు వారధులుగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి సరైన విధానంలో కృషి చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.కిషోర్, నేతలు కిషోర్, సంజయ్‌కుమార్, వాసు, శాంతకుమార్, రాజు, మాణిక్యరావు, ఎస్‌కే రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలని బైక్‌పై యాత్ర



ఎమ్మెల్యే ఆళ్ల నానిని కలిసిన మోటారు సైకిల్ యాత్ర చేస్తున్న సన్యాసిరావు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించి మరోసారి ముఖ్యమంత్రిగా అధికారపీఠం ఎక్కడం ఖాయమని శ్రీకాకుళం జిల్లా అంపోలు గ్రామానికి చెందిన గిర్లి సన్యాసిరావు అన్నారు. సీఎం వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలనే ఆకాంక్షతో 175 నియోజకవర్గాలు బైక్‌పై యాత్ర చేస్తూ సన్యాసిరావు సోమవారం ఏలూరు చేరుకుని ఎమ్మెల్యే ఆళ్ల నానిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం జిల్లా నుంచి పులివెందుల వరకు అన్ని నియోజకవర్గాలను కలుపుకుంటూ వెళుతూ యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, బీసీ సెల్ నగర అధ్యక్షులు లక్కోజు రాజగోపాలాచారి, పిట్టా ధనుంజయ్, పాము శామ్యూల్, యల్లాపు మోజెస్ తదితరులున్నారు.